
'మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి
● శ్రీనిధి నుంచి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు
● మెప్మా సిద్దిపేట జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హనుమంత్‌రెడ్డి
6లో



'ఆయిల్‌పామ్' లక్ష్యం చేరుకోవాలి

● ఈ ఏడాది 4వేల ఎకరాల లక్ష్యాన్ని పూర్తిచేయాలి
● కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటఅగ్రికల్చర్, జూలై 26: ఆయిల్‌పామ్ సాగు అత్యంత లాభదాయకమని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 11,373 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతుందని తెలిపారు. అలాగే 2024-25 సంవత్సరానికి గాను 4 వేల ఎకరాల లక్ష్యం నిర్దేశించగా ఈ ఏడాది 2,816 ఎకరాల రిజిస్ట్రేషన్ పూర్తి, 1019 ఎకరాలలో అడ్మినిస్ట్రేటివ్ అనుమతి, 268 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తయిందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, జిల్లాకు ఇచ్చిన 4వేల ఎకరాల లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తిచేయాలని చెప్పారు. ఆయిల్‌పామ్ కర్మాగారం సైతం వచ్చే ఏడాది మార్చి లోపు పూర్తవుతుందని ఆయన వివరించరు. క్షేత్రస్థాయిలో అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి ఆయిల్‌పామ్ వల్ల కలిగే లాభాలను తెలియజేసి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేష్, ఆయిల్ ఫెడ్ కన్సల్టెన్సీ అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

దుర్గమ్మ జాతరలో జగ్గారెడ్డి

పోతరాజులతో కలిసి జగ్గారెడ్డి విన్యాసం
పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు


సంగారెడ్డిలోని తాళ్లపల్లి గౌని దుర్గమ్మ ఆలయంలో సతీమణి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలకు బొట్టు పెడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


పోతరాజులతో కలిసి విన్యాసం చేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 26: సంగారెడ్డిలోని తాళ్లపల్లి రోడ్డులో ఉన్న దుర్గమ్మ ఆలయ జాతర ఉత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో జరిగే దుర్గమ్మ ఉత్సవాలకు సంగారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. జాతరలో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డితో కరచలనం చేసేందుకు ప్రజలు పోటీ పడ్డారు. జగ్గారెడ్డి చెర్నకోల చేతబట్టి పోతరాజులతో కలిసి విన్యాసం చేస్తూ అందరినీ అలరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లకాలం ఉండాలని ఆకాంక్షించారు. అనాదిగా అంగరంగ వైభవంగా సాగుతున్న దుర్గమ్మ జాతరను ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు.

'దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి పదిరోజుల క్రితం నిత్యం 209 మంది వైద్యపరీక్షల కోసం వచ్చేవారు. శుక్రవారం ఔట్ పేషెంట్ల సంఖ్య 316కు చేరింది. జ్వరాలు, వాంతులు, విరేచనాలతోపాటు కీళ్లనొప్పుల చికిత్సకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంది'

'అక్కన్నపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండగా ఉదయం 11 దాటినా ఒక్కరు కూడా రాలేదు. స్టాఫ్ నర్సు నాగమణి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. జ్వరం, దగ్గు, విరేచనాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఎక్కువగా వస్తున్నారు. ఇక ముగ్గురికి డెంగీ పాజిటివ్‌గా తేలింది.'


హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



జ్వరమొచ్చింది..

● రోగులతో ఆస్పత్రులు కిటకిట ● ప్రబలుతున్న డెంగీ, వైరల్ ఫీవర్

● వాంతులు, విరేచనాలు, కీళ్లనొప్పుల బాధలు
● క్రమంగా పెరుగుతున్న ఔట్ పేషెంట్ల సంఖ్య
● క్షేత్రస్థాయిలో అవగాహన కరువు
● సమయపాలన పాటించని వైద్యసిబ్బంది

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 26 : ఈ పరిస్థితులు అక్కన్నపేట, దుబ్బాక ఆస్పత్రిలోనే కాదు... జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిత్యకృత్యంగా మారింది. జర్వం, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న చికిత్స కోసం ఆసుపత్రుల బాట పడుతున్నారు. అయితే వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. వంతులవారీగా వైద్యులు, సిబ్బంది సేవలందిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. వానాకాలం సీజన్‌ను వ్యాధుల సీజన్‌గా పరిగణిస్తుంటారు. వర్షాల మూలంగా వాతావరణ ప్రభావంతో రోగాలు ప్రబలుతుంటాయి. ఈ క్రమంలోనే జిల్లాలో డెంగీ, వైరల్ ఫీవర్, ఇతర జ్వరాల ఉధృతి పెరుగుతున్నది. వీటిని నియంత్రించడానికి క్షేత్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులపై సంబంధిత అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ అవేవీ లేనట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితిపై శుక్రవారం జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన పరిశీలనలో పలు విషయాలు బహిర్గతమయ్యాయి.


బెజ్జంకి పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చిన జ్వరబాధితులు


ములుగులో సమయం దాటినా తెరుచుకోని ఫార్మసిస్టు గది


ములుగు పీహెచ్‌సీలో ఉదయం 10.30 తర్వాత కూడా ఖాళీగానే ఉన్న డాక్టర్ కుర్చీ

ఒక్కరోజే 1430 మందికి జ్వరాలు

జిల్లాలో 33 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 అర్బన్ హెల్త్‌సెంటర్లు, బస్తీ దవాఖానలు, గజ్వేల్‌లో జిల్లా ఆస్పత్రి, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, నంగునూరులో సీహెచ్‌సీ ఆస్పత్రులున్నాయి. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 6071 మంది ఔట్ పేషెంట్లు(ఓపీ)కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 1430 మంది సీజనల్ జ్వరాలతో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. రోగులతో ప్రభుత్వాస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 7 డెంగీ కేసులు నమోదైనట్లుగా తెలుస్తోంది. మరో రెండు నెలల పాటు వర్షాలు కురిసే నేపథ్యంలో ఇంకా వ్యాధుల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నట్లుగా వైద్యులు భావిస్తున్నారు.

అవగాహన కరువు

వర్షాకాలంలో పాటించాల్సిన రక్షణ చర్యల గురిం చి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదనే విమర్శలు నెలకొన్నాయి. వ్యాధులు ప్రబలకముందే ఇంటింటా తగిన సూచనలు ఇవ్వాల్సి ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జ్వర సర్వేతో బాధితులకు అవసరమైన సూచనలతోపాటు ఇతర రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు అందుతాయి.

పెరుగుతున్న జ్వరపీడితుల సంఖ్య..

● బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదిరోజుల క్రితం నిత్యం 65 మంది ఔట్ పేషెంట్లు రాగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 90కి చేరింది.

● అక్కన్నపేట పీహెచ్‌సీలో ఓపీ విభాగం 50 నుంచి 80కి చేరింది.

● చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత నెలకొన్నది. ఇక్కడికి దగ్గు, ఒళ్లు నొప్పులు, జ్వరం, వాంతులు, విరేచనాలతో పేషెంట్లు వస్తున్నారు. ఒకరిద్దరు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

● మద్దూరు మండలం లద్నూరులోని పీహెచ్‌సీలో ఇన్‌చార్జి డాక్టర్ ఎప్పుడో ఒకసారి వస్తున్నారు. మిగితా వారు వంతులవారీగా విధుల్లో ఉంటున్నారు. పేషెంట్లు వైద్యుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

● మద్దూరులోని పీహెచ్‌సీలో ఇదే పరిస్థితి నెలకొన్నది. ఇక యునానీ దవాఖానా రోజుల తరబడిగా తెరుచుకోవడం లేదు. డాక్టర్, ఫార్మసిస్టు విధులకు సరిగా హాజరుకావడం లేదనే విమర్శలున్నాయి.

● కుకునూరుపల్లి పీహెచ్‌సీలో ఓపీ సంఖ్య 85 నుంచి 100కు చేరింది. ఎక్కువగా జ్వరం, దగ్గు, కీళ్లనొప్పుల బాధితులు వస్తున్నారు.

● హుస్నాబాద్‌లో నిత్యం 280 నుంచి 300 మంది సీజనల్ వ్యాధులతో వైద్యపరీక్షలకు వస్తున్నారు. 30 మంది పరిస్థితి క్షీణించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

● సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 1005 మంది, గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో 400 మంది ఓపీలో రిజిస్టర్ చేసుకున్నారు.


అక్కన్నపేట మండలంలోని పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యురాలి కుర్చీ


సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యపరీక్షల కోసం క్యూలో నిల్చున్న రోగులు, కుటుంబీకులు


కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరంతో బాధపడుతున్న మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటఅర్బన్, జూలై26: సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. శుక్రవారం ఆమె సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలలో జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌తో కలిసి పర్యటించిన అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులనుద్దేశించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సీజన్‌లో డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు వేడినీటిని చల్లార్చుకుని తాగాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు అందుతున్న ఆహారం, పిల్లల ఆరోగ్యం, గర్భిణులకు, స్త్రీలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి నమూనాలను సేకరించి పరీక్షలను నిర్వహించి తగిన చికిత్స అందించాలని మండల, గ్రామస్థాయి వైద్యసిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి రేవతి, డీపీవో దేవకి దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్, ఆరోగ్య సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.


బక్రీ చెప్యాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

వైద్యులు బదిలీ.. వారి స్థానాలు ఖాళీ

● హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రిలో సకాలంలో అందని వైద్యసేవలు

హుస్నాబాద్, జూలై 26 : దాదాపు వంద గ్రామాలకు కేంద్రమైన హుస్నాబాద్ ప్రభుత్వ సామాజిక వైద్యఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఆర్థోపెడిక్, అనిస్తీషియా, పిడియాట్రిక్, డెంటల్ వైద్య నిపుణులు బదిలీ అయ్యారు. ఆ స్థానాలను భర్తీ చేయకపోవడంతో సకాలంలో వైద్యసేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. నిత్యం 300 మందికి పైగా ఓపీ ఉండే ఈ 50 పడకల ఆసుపత్రిలో గైనకాలజిస్టు, డ్యూటీ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో పనిచేసేందుకు ఎవరూ సుముఖత చూపడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా స్థానాల్లో వైద్యనిపుణులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలు ప్రారంభం

మొన్నటి వరకు ఆరోగ్యశ్రీ సేవలకే పరిమితమైన హుస్నాబాద్ ఆసుపత్రిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, (ఈహెచ్‌ఎస్), జర్నలిస్టు హెల్త్ స్కీం సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆసుపత్రిలో శుక్రవారం ఈ సేవలు ప్రారంభం కాగా ఒక ఉద్యోగికి ఈ స్కీం ద్వారా డయాలిసిస్ చేశారు.



సెల్యూట్.. సైనికా..

సిద్దిపేట క్రైం, జూలై 26 : కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో 3500 మంది విద్యార్థులతో బీజేఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిద్దిపేట డీసీపీ మల్లారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ఫ్లకార్డులు, త్రివర్ణ పతాకాలను చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీ పాల్గొన్నారు. కార్గిల్ పోరాటం చేసిన వీర జవానులను డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, సిద్దిపేట ప్రైవేట్ స్కూల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గుమల్లారెడ్డి, జిల్లా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మల్లారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ట్రస్మా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి, ప్రతినిధులు భగవాన్‌రెడ్డి, శ్రీకాంత్, సత్యం, సంపత్ కుమార్, రమేష్, సంతోష్ కుమార్, వెంకటేష్, సంతోష్, ఎజాస్ అలీ, సునైనా, స్వామి దాస్ పాల్గొన్నారు.






గోరింటాకును రుబ్బుతున్న మహిళలు


గోరింటాకును పెట్టుకుంటున్న మహిళలు, చిన్నారులు

ఆషాఢం.. గోరింట

గోరింటాకు అంటే ఇష్టపడని మగువలు ఉండరు. ఈ మధ్యకాలంలో పండుగలు, శుభకార్యాలకు మహిళలు, యువతులు, చిన్నారులు మోహందీ ఎక్కువగా వాడుతున్నా.. ఆషాఢమాసంలో మాత్రం గోరింటాకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ మాసంలో వాతావరణంలో మార్పులు, అధిక వర్షాలు, సీజనల్ వ్యాధులు, చర్మ వ్యాధులు అధికంగా వస్తుంటాయి. ఈ గోరాంటా(మైదా)కు పెట్టుకోవడం వల్ల వాటి నుంచి ఉపశమనం ఉంటుందని మన పూర్వీకులు చెబుతుంటారు. పట్టణాల్లో అయితే ప్రత్యేకంగా గోరింటాకు వేడుకలు నిర్వహిస్తారు. అదేవిధంగా పల్లెల్లో మహిళలు ఒక చోట చేరి గోరింటాకు పెట్టుకుంటారు.

- చిన్నకోడూరు, జూలై 26







రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి అర్బన్, జూలై 26 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో జరగనున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ ఆధార్, బర్త్ సర్టిఫికెట్, బొనాఫైడ్, రెండు ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. క్రీడాకారులు 1.9.2008 నుంచి 31.08.2010 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు.








పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మహేష్

నారాయణరావుపేట, జూలై 26 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి తునికి మహేష్ డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీవోలకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తునికి మహేష్ మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నంబర్ 51ని సవరించాలని, పాత పద్ధతిలోనే కేటగిరీలను కొనసాగించాలన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా విధులు నిర్వహిస్తున్న వారికి వేతనాలు సవరించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్రీకాంత్, నరేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.







కార్యకర్తలు అధైర్య పడొద్దు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, జూలై 26 : కార్యకర్తలు అధైర్య పడొద్దని, బీఆర్‌ఎస్ పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వరదరాజుపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గోవర్ధనగిరిలో ఇటీవల గుండెపోటుకు గురైన లింగంను, వరదరాజుపల్లిలో మృతిచెందిన కార్యకర్త తిరుపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వరదరాజుపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులైన రాజవ్వ, లాస్య, రవి కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, స్వామి, చిలువేరి మల్లారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భైరయ్య, వెంకట్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, స్వామిరెడ్డి, రాఘవులు తదితరులు ఉన్నారు.

ఎఫ్‌పీవో లావాదేవీల అవకతవకలపై విచారణ

చేర్యాల, జూలై 26 : చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో రైతుల భాగస్వామ్యంతో నెలకొల్పిన ఎఫ్‌పీవో నిర్వహకులు లావాదేవీలలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం నాబార్డు అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని చిట్యాల, ఆకునూరు, చుంచనకోట, వేచరేణి, కడవేరుగు గ్రామాలకు చెందిన సుమారు 380 మంది రైతులు మూడేళ్ల క్రితం వ్యక్తిగత సభ్యత్వం పొంది సంఘంగా ఏర్పడి ఫర్టిలైజర్ దుకాణాన్ని నెలకొల్పారు. వ్యాపారాభివృద్ధికి నాబార్డు ద్వారా రూ.6.20 లక్షలు నిధులు మంజూరు చేసినప్పటికీ కొన్నాళ్లుగా లావాదేవీలు జరపకపోగా, లెక్కలు చూపకుండానే నష్టాల్లో ఉందంటూ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చని విషయమై సందేహాలు తలెత్తాయి. దీంతో ఇటీవల పలువురు నాబార్డు అధికారులకు ఫిర్యాదు చేయడంతో చిట్యాలకు చేరుకున్నారు. రైతువేదికలో రైతుల సమక్షంలో లావాదేవీలను పరిశీలించారు. నష్టం అంచనా వివరాలు తెలియాల్సి ఉంది.

'మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి

- మెప్మా సిద్దిపేట జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హనుమంత్‌రెడ్డి

గజ్వేల్, జూలై 26 : మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వ్యాపారపరంగా అభివృద్ధి చెందేందుకు మహిళలకు రుణాలు అందజేస్తామని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ హనుమంత్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళిగుప్తా, కమిషనర్ నరసయ్యతో కలిసి శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో మహిళా శక్తి అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి మెప్మా స్లామ్ సమైక్య ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార పరంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకులు శ్రీనిధి నుంచి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి సరిత, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

50 శాతం పీఆర్సీ ప్రకటించాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ

చేర్యాల, జూలై 26: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఏ.శశిధర్‌శర్మ పేర్కొన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్లకోసారి ప్రకటించే పీఆర్సీ ఉపాధ్యాయ, ఉద్యోగుల జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్నందున ప్రభుత్వం తాత్సారం వహించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షుడు కేవీయన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రావు, వరదరాజులు, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల సమగ్రాభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలి

- ఎమ్మెల్సీ దేశపతిని కోరిన డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్, జూలై 26 : దళిత, గిరిజనుల సమగ్రాభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌ను డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం దేశపతిని కలిసిన శంకర్ ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కేటాయింపుపై మాట్లాడారు. దళితుల, గిరుజనుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణలను అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేయాలని కోరారు.

విద్యాధరిలో శని త్రయోదశి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖర శర్మ సిద్ధాంతి

వర్గల్, జూలై 26 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శనైశ్చరాలయంలో ఆగస్టు 17, 31వ తేదీలలో నిర్వహించే శని త్రయోదశి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయ్యాలని వర్గల్ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. శుక్రవారం విద్యాధరి క్షేత్రంలో ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెలలో శనిత్రయోదశి వేడుకలతో పాటు సెప్టెంబర్ 7న వినాయక నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, అందుకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ఇప్పటి నుంచే మొదలు పెట్టాలన్నారు. ఆలయ నిర్వహణ, క్షేత్రానికి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం, భక్తుల భద్రత, వేద పాఠశాల నిర్వహణ, నిత్యాన్నదానంపై కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. క్షేత్రంలో ప్రతీ ఉత్సవానికి సహకరిస్తున్న దాత డాక్టర్ రాజేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెట్టుకు వాహనం ఢీకొని ఒకరి మృతి

చిన్నశంకరంపేట, జూలై 26 : చెట్టుకు వాహనం ఢీకొని ఒకరు మృతి చెంది సంఘటన చిన్నశంకరంపేట మండలం టీమాందాపూర్ గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్టి రవి(40) సొంత పనుల కోసం బైక్‌పై వెళ్తున్న సమయంలో గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొన్నది. ఈ ఘటనలో రవి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ నారాయణగౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రవికి భార్య సంధ్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రియుడు వివాహానికి నిరాకరించడని ఆత్మహత్యాయత్నం..

చికిత్స పొందుతూ యువతి మృతి

కొండపాక, జూలై 26 : ప్రేమించిన వ్యక్తితో వివాహానికి ఒప్పుకోకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కొండపాక మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి బందారం గ్రామానికి చెందిన తిప్ప స్వామి, బాలమణి కుమార్తె శివాని(20) సిద్దిపేటలో డిగ్రీ పూర్తి చేసి మూడు నెలలుగా ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నది. అయితే, ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో ఇదే మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమకు దారి తీసింది. ఇంట్లో పెళ్లి ప్రస్తావన వచ్చే సరికి తల్లిదండ్రులకు తన ప్రేమ గురించి చెప్పింది. ఈ విషయాన్ని యువకుడితో ప్రస్తావించి పెళ్లి చేసుకోవాలనగా అతడు నిరాకరించాడు. విషయం తెలిసి తల్లిదండ్రులు శివానిని మందలించటంతో కలత చెందింది. ఈనెల 10 తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన తల్లిదండ్రులు ఆమెను సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసి పోలీసులు శివాని వాంగ్మూలం సేకరించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. పదిహేను రోజులుగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి శివాని మృతిచెందింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఫోరెన్సిక్ వైద్య పరీక్షల అనంతరం పోలీసుల సమక్షంలో పోస్టుమార్టం చేశారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం బందారం తరలించారు.

అమెరికాలో ఉన్న తమ్ముడిలా మాట్లాడి

రూ.70 వేల మోసం

పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

జిన్నారం, జూలై 26 : అమెరికాలో ఉన్న తమ్ముడిలా కాల్‌లో మాట్లాడి ఓ మహిళ నుంచి రూ.70 వేలు దోచేశారు సైబర్ కేటుగాళ్లు. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక విఘ్నేశ్వర కాలనీలో నివాసం ఉండే పల్లగాని మధు భార్య తమ్ముడు అమెరికాలో ఉంటున్నాడు. ఈ నెల 25న మధు భార్యకు ఫోన్ వచ్చింది. ఆమె తమ్ముడిలా మాట్లాడిన గుర్తు తెలియని వ్యక్తి అర్జెంట్‌గా రూ.70 వేలు పంపమని అడిగాడు. వెంటనే ఆమె పంపించగా, మరో రూ.30 వేలు కావాలని మళ్లీ అడిగాడు. అనుమానం వచ్చిన బాధితురాలు అదే నంబర్‌కు ఫోన్ చేస్తే సమాధానం రాలేదు. దీంతో మోసపోయానని గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చిరుత దాడిలో గేదె మృతి

తొనిగండ్లలో ఘటన


చిరుత దాడిలో మృతిచెందిన గేదె

రావహాయంపేట, జూలై 26 : ఆహారం కోసం పశువులపై చిరుత చేస్తున్న దాడులు రైతులను నిద్ర లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున మండల పరిధి తొనిగండ్ల శివారు పటేల్ కుంట వద్ద చిరుత ఓ దున్నపోతును చంపేసింది. రైతు పోటీగారి రమేష్ ఎప్పటిలాగే తన పొలంలోని కొట్టంలో పశువులను కట్టేశాడు. తెల్లవారి వెళ్లేసరికి కొద్ది దూరాన దున్నపోతు చనిపోయి ఉంది. అక్కడ చిరుత ఆనవాళ్లు కనిపించాయని బాధిత రైతు తెలిపారు. ఈ మేరకు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారం క్రితమే ఝాన్సీ లింగాపూర్ శివారులోనూ ఓ గేదెను చిరుత చంపేసింది. ఇప్పటికే సుమారు పది పశువులు చిరుతకు ఆహారమయ్యాయి. గతంలో చిరుతను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ ఇపుడు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు చిరుతను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈగా జగదీశ్వర్


బాధ్యతలు స్వీకరిస్తున్న జగదీశ్వర్

మెదక్ మున్సిపాలిటీ, జూలై 26 : పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈగా టి.జగదీశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి డీపీఆర్ఈఈగా పనిచేసిన ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన బి.శ్రీహరిగౌడ్ రంగారెడ్డి జిల్లా విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు తీసుకున్న ఇన్‌చార్జి ఎస్ఈ జగదీశ్వర్ అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మంబోజిపల్లి-దామరంచ హైలెవల్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ నర్సింలు, డీఈ పాండురంగారెడ్డి, పీఏ టు-ఎస్ఈ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి రాష్ట్రం పేరు నిలబెట్టాలి

● తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గణపతి


ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు

సిద్దిపేట టౌన్, జూలై 26 : క్రీడల్లో రాణించి రాష్ట్రం పేరును నిలబెట్టాలని తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గణపతి ఫాల్గుణ క్రీడాకారులకు సూచించారు. ఆగస్టు 1 నుంచి కర్ణాటకలో జరిగే జూనియర్ జాతీయ బాలికల ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారుల ఎంపిక, శిక్షణ శిబిరం సిద్దిపేట పట్టణంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో గణపతి ఫాల్గుణ మాట్లాడుతూ గెలుపోటములు పక్కనబెట్టి ఆటను ఆస్వాదిస్తూ ఆడాలని సూచించారు. మనసును ఆటపై కేంద్రీకరిస్తే విజయం మీ సొంతం అవుతుందని, శిబిరంలో మీరు నేర్చుకున్న ఆటను అద్భుతంగా ప్రదర్శించేలా అందరూ ఉత్సాహంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, బయట ఆహారానికి, నీటికి దూరంగా ఉండాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు సిద్దిపేట అసోసియేషన్ కార్యదర్శి కోచ్ అక్బర్ నవాబ్, వినోద్, సభ్యులను అభినందించారు. సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాలసాయిరాం మాట్లాడుతూ జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ జట్టును సిద్దిపేటలో ఎంపిక చేయడం గర్వంగా ఉందని, మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతోనే సిద్దిపేటలో స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కృష్ణమూర్తి, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్, సభ్యులు సాజిద్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై వెళ్లేదెలా?

నార్సింగి- శాలిపేట దారిలో నాట్లు వేసి నిరసన



బురదమయమైన నార్సింగి-శాలిపేట్ దారిలో నాట్లు వేస్తున్న గ్రామస్థులు

చేగుంట జూలై 26 : నార్సింగి మండలం కేంద్రం నుంచి శాలిపేట్‌కు వెళ్లే దారి బురదమయమై అడుగు తీసి అడుగు వేయరావడం లేదు. శుక్రవారం ఈ దారిలో వరి నాట్లు వేసి పరిసర ప్రాంతాల రైతులు నిరసన తెలిపారు. ఇటీవల ఈ రోడ్డు నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి దాదాపు రూ.18 లక్షలను మంజూరు చేయించి, పనులను ప్రారంభింపజేశారు. రోడ్డు విస్తరణ కోసం సహకరించాలని కోరగా, రైతులు ఒప్పుకున్నారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మట్టిని పోసి చేతులెత్తేశారు. మొరం వేయడానికి ముందు ఈదారిలో కనీసం ద్విచక్ర వాహనంపైనైనా ప్రయాణం చేయడానికి వీలుగా ఉండేదని, ఇప్పుడు కాలి నడకన కూడా వెళ్లడం సాధ్యం కావడం లేదని రైతులు వాపోతున్నారు. పొలాలకు మందు బస్తాలు ఇతర సామగ్రి తీసుకెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే చొరవ తీసుకుని వెంటనే రోడ్డు మరమ్మతు చేయాలని కోరారు.

బీబీపేట ప్యాక్స్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

● సమావేశానికి హాజరు కానీ ఇరు వర్గాల డైరెక్టర్లు


కల్హేర్ మండలంలోని బీబీపేట ప్యాక్స్ కార్యాలయంలో అధికారులు

కల్హేర్, జూలై 26 : మండల పరిధిలోని బీబీపేట ప్యాక్స్ చైర్మన్ మహారెడ్డి నరేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. ఈనెల 5న ఏడుగురు డైరెక్టర్లు సంగారెడ్డిలోని జిల్లా సహకార శాఖ అధికారికి అవిశ్వాస నోటీసు ఇవ్వగా, శుక్రవారం బీబీపేట ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా సహకార అధికారి టి.ప్రసాద్ రిజిస్ట్రార్లు సిద్దారెడ్డి, చిన్నారావు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభం కాగా సమావేశానికి ఒక్కరూ హాజరుకాలేదు. నిబంధనల ప్రకారం అర గంట సమయం వరకు అధికారులు వేచి చూశారు. అయినా, ఇరు వర్గాలకు చెందిన ఒక్క డైరెక్టర్ సమావేశానికి రాలేదు. దీంతో చైర్మన్ నరేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు డీసీవో ప్రసాద్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నరేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు, మరో ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టగా ఇందులో నుంచి ఇద్దరు చైర్మన్ నరేందర్‌రెడ్డి నిర్వహించిన క్యాంపులో చేరిపోయారు. దీంతో అవిశ్వాసానికి అవసరమైన బలం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు ప్రత్యేక సమావేశానికి హాజరు కాలేదు. క్యాంపు పేరిట విహారయాత్రలో ఉన్న చైర్మన్ వర్గానికి చెందిన డైరెక్టర్లు కూడా సమావేశానికి హాజరు రాలేదు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీబీపేట ప్యాక్స్ సీఈవోపై ఫిర్యాదు చేద్దామని నమ్మించి, అవిశ్వాసంపై సమాచారం ఇవ్వకుండానే వారితో సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి డైరెక్టర్ల బలం లేకుండానే తనపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారని విమర్శించారు. ఆత్మ కమిటి మాజీ చైర్మన్ గుండు నరేందర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ క్రిష్ణమూర్తి, డైరెక్టర్ బండారి సాయిలు స్పందిస్తూ తమకు డైరెక్టర్ల బలం ఉందని, చైర్మన్ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ డైరెక్టర్లను కొనుగోలు చేసి క్యాంపునకు తరలించారని ఆరోపించారు. అయినా, బీబీపేట ప్యాక్స్‌లో జరిగిన అవినీతిని వెలికితీస్తామని అన్నారు. అవిశ్వాసం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం ఆధ్వర్యంలో బందోబస్తును చేపట్టారు.

టేక్మాల్ సొసైటీలో విరమించుకున్న డైరెక్టర్లు

టేక్మాల్, జూలై 26 : టేక్మాల్ సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానాన్ని విరమించుకున్నారని మెదక్ జిల్లా డీసీవో కరుణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన టేక్మాల్ సహకార సంఘం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గురువారం అవిశ్వాస సమావేశాన్ని అనివార్య కారణాలతో శుక్రవారం నాటికి వాయిదా వేశామని తెలిపారు. అయితే, శుక్రవారం సమావేశాన్ని నిర్వహించడానికి ముందే ఎనిమిది మంది డైరెక్టర్లు అవిశ్వాసాన్ని వెనక్కి తీసుకున్నారని తెలిపారు. ఓ డైరెక్టర్‌ను అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని, అందుకే విరమించుకుంటున్నట్లు విరమణపత్రం అందజేశారని వివరించారు. దీంతో, ఈ అవిశ్వాసం నెగ్గినట్టు కాదు వీగినట్టు కాదు అని ఆమె పేర్కొన్నారు. గత చైర్మన్ కుచన్‌పల్లి యశ్వంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకయ్య తమ పదవుల్లో కొనసాగుతారని ఆమె ప్రకటించారు. ఆమె వెంట సీఈవో వేణుగోపాల్, అధికారులు ఉన్నారు.


టేక్మాల్ సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతున్న మెదక్ డీసీవో కరుణ

దశాబ్దాల నిరీక్షణకు తెరపడేదెన్నడో?

● కొలిక్కిరాని జహీరాబాద్ ఐడీఎస్ఎంటీ ప్లాట్ల సమస్య

జహీరాబాద్, జూలై 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ సమీపంలో 1982లో ఏర్పాటు చేసిన ఐడీఎస్ఎంటీ (ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ అండ్ మీడియం టౌన్‌షిప్) కాలనీలో ప్లాట్ల కేటాయింపు సమస్య దశాబ్దాల కాలంగా కొలిక్కి రావడం లేదు. ఇదిగో చేస్తాం.. అదిగో అవుతుందంటూ అధికారులు, నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదు. ఐడీఎస్ఎంటీ అంటేనే అమ్మో అదో వివాదాస్పద సమస్య అనే స్థాయికి తీసుకొచ్చారు. సజావుగా కొనసాగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో కొందరు అనవసరంగా తలదూర్చుతూ చివరకు వాటిని అర్ధాంతరంగా ఆపే వరకు ఊరుకోరని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అర్హులు సైతం అనర్హులుగా మారుతున్న పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.



ఐడీఎస్ఎంటీ ప్లాట్ల కోసం కేటాయించిన స్థలం

101 ఎకరాల్లో 1,294 ప్లాట్లు

1982లో అప్పటి ప్రభుత్వం పట్టణంలోని హౌజింగ్ బోర్డుకు ఆనుకుని ఉన్న 156, 157, 158, 160, 161 సర్వే నంబర్లలోని 101 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమిలో ఐడీఎస్ఎంటీ కింద 1,294 ప్లాట్లను చేశారు. అందులో 1,115 ప్లాట్లను అప్పట్లో రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు సిద్ధం చేశారు. 1987 నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభించి 2009 వరకు ఏటా కొన్ని చొప్పున నామినల్ ఫీజుతో మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే, రిజిస్ట్రేషన్లలో అనేక గోల్‌మాల్‌లు జరిగాయి. ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కొందరు 2009లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన వాటిని రద్దుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 2013లో న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. 2009 నుంచి 2013 వరకు ప్లాట్ల సమస్య న్యాయస్థానం పరిధిలో ఉండడంతో ఐడీఎస్ఎంటీ కాలనీ విషయంలో అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. 2013లో న్యాయస్థానం ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అంతే ఇక దీనిని పట్టించుకోలేదు. ఈ వ్యవహారాన్ని ఎటుతేల్చకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఆదాయ వర్గాల వారీగా కాలనీలు

అప్పట్లో ఇక్కడ ఆదాయ వర్గాల వారీగా ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ, ఈడబ్ల్యూఎస్ కాలనీలను ఏర్పాటు చేయాలని నిబంధనలను తీసుకువచ్చి అర్హులను గుర్తించి ప్లాట్ల కేటాయింపులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఈడబ్ల్యూఎస్ కింద 110 గజాలకు రూ.5 వేలు, ఎల్ఐజీలో 260 గజాలకు రూ.15వేలు, ఎంఐజీలో 300 గజాలకు రూ.16,500, హెచ్ఐజీలో 360 గజాలకు రూ.21,000 చొప్పున ఫీజులను నిర్ధారించి అప్పట్లో రిజిస్ట్రేషన్‌లను చేశారు. ఇందులో ఉన్నతాదాయ వర్గాలకు హెచ్ఐజీలో 76 ప్లాట్లు, మధ్యతరహా వారికి ఎంఐజీలో 264 ప్లాట్లు, పేదలకు ఎల్ఐజీలో 305, వెనుకబడిన వర్గాలకు ఈడబ్ల్యూఎస్ కాలనీలో మరికొన్ని ప్లాట్లను అప్పట్లో లబ్ధిదారులకు కేటాయించారు. ప్రస్తుతం అందులో సుమారు 300 మంది లబ్ధిదారులు ఇళ్లను సైతం నిర్మించుకున్నారు. ఇళ్లను నిర్మించుకున్న కొందరు తమ కాలనీలో వసతులు కల్పించాలని అధికారులకు, పాలకులకు వేడుకున్న ప్రయోజనం లేకుండా పోయింది.

ఎన్నికలతో సమస్యకు బ్రేక్

ఏళ్ల తరబడి నానుతూ వస్తున్న ఐడీఎస్ఎంటీ ప్లాట్ల సమస్యను గతంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌కు విన్నవించారు. వారు స్పందించి వివాదస్పదంగా లేని వాటిని మ్యుటేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో లబ్ధిదారుల్లో కొంత మేరకు ఆశలు చిగురించాయి. వారి ఆదేశాలతో అడుగుపడుతున్న క్రమంలోనే రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యకు తీరుతుందని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యను పరిగణలోకి తీసుకుని పరిష్కరిస్తుందేమోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారుల వద్ద సర్టిఫికెట్లు ఉన్నాయి కానీ ప్లాట్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఉన్నతాధికారులకు నివేదించాం



ఐడీఎస్ఎంటీకి సంబంధించిన వివరాలన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి సూచనల మేరకు అక్కడి నుంచి అనుమతులు వస్తే మ్యుటేషన్ ప్రారంభిస్తాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి కార్యాచరణ చేపడుతాం.

- శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

నిరుపేద విద్యార్థికి కలెక్టర్ చేయూత

● ఐఐటీ సాధించిన ఆర్యన్ రోషన్‌కు లాప్‌టాప్‌తో పాటు నగదు అందజేత

కోహెడ, జూలై 26 : మండలంలోని నకిరెకొమ్ముల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి బి.ఆర్యన్ రోషన్‌కు కలెక్టర్ ఎం.మను చౌదరి చేయూత అందించారు. కష్టపడి చదివి తిరుపతి ఐఐటీలో సీటు సాధించిన ఆర్యన్‌రోషన్‌కు శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ తన చాంబర్‌లో రూ.40,500 విలువ చేసే హెచ్‌పీ లాప్‌టాప్‌తో పాటు ఐఐటీ మొదటి సెమిస్టర్ ఫీజు రూ.36,750 చెక్‌ను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆర్యన్ రోషన్ కోహెడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించాడు. అదే విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదివి ప్రతిష్టాత్మకమైన తిరుపతి ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించాడు. అతనికి ఐఐటీలో చేరేందుకు పేదరికం అడ్డురావడంతో స్పందించిన కలెక్టర్ చదువుకునేందుకు తోడ్పాటు నందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్యన్ రోషన్ తండ్రి చిన్నతనంలోనే మరణించినా తల్లి రాజమణి రోజు కూలి చేసి తనను చదివించగా పట్టుదలతో చదివి ఐఐటీ సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఇలాగే ఐఐటీ పూర్తి చేసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని, నిరుపేద విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.


ఆర్యన్ రోషన్‌కు లాప్‌టాప్‌తో పాటు చెక్‌ను అందజేస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

నాటిన మొక్కలను సంరక్షించాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, జూలై 26 : మొక్కలను నాటడం కాదని, అవి పెరిగి ఫలాలు అందించే వరకు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో దేశ వ్యాప్తంగా మొక్కలు నాటాలన్న యూనియన్ బ్యాంక్ పిలుపు మేరకు.. సిద్దిపేట రీజనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణితో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఈద వికాస్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ రాఘవ, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

కొండపాక ఫిషరీస్‌కు రూ.10 లక్షల గ్రాంటు

కొండపాక, జూలై 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహిస్తున్న కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసింగ్ కంపెనీకి రూ.10 లక్షల ఈక్విటి గ్రాంటు మంజూరైనట్టు సంస్థ సీఈవో నారదాసు ఈశ్వర్ తెలిపారు. ప్రకృతి పర్యావరణ సంస్థ నిర్వహణలో ఏర్పాటైన కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసింగ్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 500 మంది ముదిరాజ్ మత్స్యకారులతో రూ.10 లక్షల సభ్యత్వ వాటా ధనం సేకరించినట్టు పేర్కొన్నాడు. దీనికి అదనంగా మరో రూ.10 లక్షల ఈక్విటీ గ్రాంట్ నిధులు మంజూరైనట్లు ఆయన వివరించాడు. కేంద్ర మంత్రిత్వ శాఖ స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్షియం నేతృత్వంలో ఈ రూ.10 లక్షల నిధిని కేటాయిస్తూ ఆర్డర్ కాపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ పాలకవర్గ ప్రతినిధులకు, రాష్ట్ర మత్స్యశాఖ సంచాలకులు ప్రియాంక, అదనపు సంచాలకులు శంకర్ రాథోడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌లలో రూ.212 కోట్ల రుణమాఫీ

సంగారెడ్డి జిల్లా సహకార అధికారి టి.ప్రసాద్


మాట్లాడుతున్న డీసీవో ప్రసాద్

కల్హేర్, జూలై 26 : ఉమ్మడి మెదక్ జిల్లాలోని 53 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలోని 22,086 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకంలో ప్రయోజనం కలుగనుందని సంగారెడ్డి జిల్లా సహకార శాఖ అధికారి టి. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన బీబీపేటలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న 53 పీఏసీఎస్‌లలో మూడు పీఏసీఎస్‌లు పనిచేయడం లేదని, మిగతా 49లో 22,086 మంది రైతులకు రూ.212.46 కోట్లు రుణమాఫీ జరుగనున్నట్లు ఆయన తెలిపారు. రూ.లక్ష లోపు రుణమాఫీలో భాగంగా మొదటి విడతగా 6,090 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు ఆయన తెలిపారు. 16 పీఏసీఎస్‌లు ఎస్‌బీఐ పరిధిలో ఉండగా ఆ సొసైటీల్లో రుణమాఫీ జరగలేదని, దీనిపై ప్రభుత్వ ఆదేశాల అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ పీఏసీఎస్‌లలో ఎరువుల విక్రయం, నగదు లావాదేవీలు నిరంతరం జరపాలని, దీని ద్వారా రైతులు సభ్యులుగా ఉన్న పీఏసీఎస్‌లకు ఎంతో లాభాలు వస్తాయని ప్రసాద్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ఝరాసంగం, నిజాంపేట మండలంలోని బాచేపల్లి, కొండాపూర్ మండలంలోని మల్కాపూర్, సిర్గాపూర్ మండలంలోని బొక్కస్‌గామ్‌లలో పెట్రోల్ పంప్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు డీసీవో ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో సహకార శాఖ రిజిస్ట్రార్లు సిద్దారెడ్డి, చిన్నారావ్, సీఈవో రాంచందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు తాళం

● వైద్యురాలు, ఫార్మాసిస్టు బదిలీ
● మరెవరిని కేటాయించని అధికారులు


తాళం వేసి ఉన్న ఆయుర్వేద వైద్యశాల గది

అక్కన్నపేట, జూలై 26 : అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ గదిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఈ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యురాలు, ఫార్మాసిస్టు బదిలీఅయ్యారు. దీంతో శుక్రవారం ఆయుర్వేద వైద్యశాలకు తాళం పడింది. ఈ విషయం తెలియక వర్షంలో హాస్పిటల్‌కు వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలు డాక్టర్ సరోజ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని బోర్నపల్లి ఆయుర్వేద వైద్యశాలకు, ఫార్మాసిస్టు రాజమణి కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలకు బదిలీపై వెళ్లగా వైద్యాధికారితోపాటు ఫార్మాసిస్టును ఇంకా భర్తీ చేయలేదు. ఆయుర్వేద భవనం శిథిలావస్థకు చేరడంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ గదిలో ఆయుష్ సేవలను అందిస్తున్నారు. మండల పరిధిలోని పలు గిరిజన తండాలు, గ్రామాల నుంచి ప్రజలు ఆయుర్వేద చికిత్స కోసం ఈ వైద్యశాలకు వస్తారు. ప్రస్తుతం వారు బదిలీపై వెళ్లడంతో తాళాలు తీసే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్కన్నపేట ఆయుర్వేద వైద్యశాలలో వైద్యాధికారి, ఫార్మాసిస్టు పోస్టులను సత్వరమే భర్తీ చేసి సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



వైద్యులు, సిబ్బంది లేక ఆయుర్వేద వైద్యశాలకు తాళం పడింది. దీంతో మండల ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యులను నియమించి ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

- పెసరు సాంబరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, అక్కన్నపేట

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

- బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన నాయకులు

దుబ్బాక, జూలై 26: ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఆయా పథకాలకు బడ్జెట్ కేటాయించకపోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అంబటి బాలేష్‌గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలంటూ దుబ్బాక పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ధర్నా చేశారు. కార్యక్రమంలో బీజేపీ దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ ఎస్ ఎన్‌చారి, జిల్లా ప్రధానకార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శివప్రసాద్, సుభాష్‌రెడ్డి, నాయకులు ప్రవీన్, భాస్కర్, రాజశేఖర్, రమణరెడ్డి, రమేష్‌రెడ్డి, సప్తగిరి, శ్రీకాంత్, నేహాల్, అశోక్, కనకరాజు తదితరులున్నారు.



సిద్దిపేట క్రైం: నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

- **సిద్దిపేట క్రైం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్పష్టత లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీజేపీ నాయకులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాసంగారి వెంకట్, పట్టణ అధ్యక్షుడు నగేష్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు నీలం దినేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్

- **చిన్నకోడూరు:** ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చొప్పదండి విద్యాసాగర్ ఆరోపించారు. బీజేపీ పార్టీ మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం చిన్నకోడూరులో ఆపార్టీ మండలాధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు మాతంగి నాగరాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు అక్కి సంతోష్, మహేష్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, సీనియర్ నాయకులు పర్శరాములు, తదితరులున్నారు.



చేర్యాల: జాతీయరహదారిపై ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- **చేర్యాల:** ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్‌చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం చేర్యాల పాతబస్టాండు వద్ద జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, నాయకులు తాడూరి భరత్‌కుమార్, షైసంపల్లి రాహుల్, ప్రశాంత్, రజింత్, రాజు, రవి, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



గజ్వేల్: సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

- **గజ్వేల్:** గజ్వేల్ అభివృద్ధిని పట్టించుకునే నాథుడేవరని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పట్టణ బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గతంలో సీఎం నియోజకవర్గంగా ఉన్న గజ్వేల్‌లో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల్లో రూపాయి అభివృద్ధి చేయలేదన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాష్ట్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధరం గురువారెడ్డి, మద్దాడి జశ్వంత్‌రెడ్డి, నలగామ శ్రీనివాస్‌నాయకులు కుడిక్యాల రాములు, శశి, తదితరులున్నారు.
- **మర్కుక్:** రాష్ట్ర ప్రజలను ఏ మాత్రం మెప్పించని బడ్జెట్ ఇవాళ ప్రవేశపెట్టిన బడ్జెట్ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెప్యాల రాజురావు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికైనా రాష్ట్రం సమాజం కళ్లు తెరవాలన్నారు.
- **అక్కన్నపేట:** కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు పోరాటాలు నిర్వహిస్తామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి ప్రాజెక్టు పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్లపల్లి వీరాచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, ఎస్టీ మోర్చాజిల్లా నాయకులు సునావత్ మోహన్ నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ జంగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- **హుస్నాబాద్ రూరల్:** రాష్ట్ర ప్రజలను నమ్మించి అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ గద్దెనెక్కిందని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి సుద్దాల చంద్రయ్య ఆరోపించారు. హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతుబంధు పథకాలను పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాం తదితరులున్నారు.
- **సిద్దిపేట అర్బన్:** అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి రాష్ట్ర బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగానికి 7.3శాతం నిధులు కేటాయించడం విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే అని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యారంగ పరిస్థితుల గురించి ఏమాత్రం అసెంబ్లీలో చర్చ చేయకుండా ఇష్టానుసారంగా నిర్వహించిన బడ్జెట్లో విద్యారంగానికి కేటాయించిన నిధులు 7.3శాతం ఏమాత్రం సరిపోవని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తుల అభి, లక్ష్మణ్, అజయ్ అరుణ్, నవీన్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.
- **మిరుదొడ్డి:** బడ్జెట్ పేరుతో ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజులు విమర్శించారు. మిరుదొడ్డిలో బీఆర్ఎస్ ముఖ్యనాయకుడు తోటకమలాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టేవిధంగా ఉందని విమర్శించారు. సమావేశంలో సర్పంచుల ఫోరం మిరుదొడ్డి మాజీ మండలాధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఎంసీ మాజీ వైస్ చైర్మన్ మల్లేశంగౌడ్ ఉన్నారు.



హుస్నాబాద్ టౌన్: ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

- **హుస్నాబాద్ టౌన్:** రాష్ట్ర బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు, తోట స్వరూప, బొమ్మగాని సతీష్, చిట్టి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండలాల అధ్యక్షులు వెల్దండి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.
- **దూళిమిట్ట:** ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ వట్టి బడ్జెట్ అని బీఎస్పీ మండల అధ్యక్షుడు గుండె ఉదయ్‌కుమార్ విమర్శించారు. ఉద్యోగ కల్పన, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

- మెదక్ పార్లమెంటు కో కన్వీనర్ చింతా సంతోష్‌కుమార్

సిద్దిపేటరూరల్, జూలై 26: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో బీజేపీ జెండా ఎగరాలని ఆ పార్టీ మెదక్ పార్లమెంటు కో కన్వీనర్ చింతా సంతోష్ కుమార్ పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాలలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్‌గౌడ్ అధ్యక్షతన మండల స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజు, మెడికల్ సెల్ జిల్లా కన్వీనర్ మల్లమ్మగారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తొగుట, జూలై 26 : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని బీజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రాములు సూచించారు. శుక్రవారం తొగుట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యే మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణరెడ్డి, నాయకులు నర్సింలు, చంద్రశేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, స్వామిరెడ్డి, నరసింహారెడ్డి, కళ్యాణ్‌దాస్, అంజనేయులు, రాజశేఖర్, నరేష్‌గౌడ్, నరేందర్, రాజిరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

వ్యవసాయరంగానికి పెద్దపీట

- కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 26: బడ్జెట్‌లో 25 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మరోసారి నిరూపించిందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, రాజు, సీతాబాల్, సోహెల్, సాయికుమార్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- **గజ్వేల్:** రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమ బడ్జెట్ అని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, విద్యా వైద్య రంగానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ వెనకాల ఉన్న శివాలయం భూముల విషయంలో చేసే పోరాటనికి పూర్తిస్థాయిలో మద్దతు పలుకుతామని, ఏ పోరాటానికైనా సిద్ధమని తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శివాలయం భూములు శివాలయానికి చెందేలా కృషిచేస్తామని, అన్ని పక్షాలను కలుపుకుని పోరాటం చేసేందుకు సిద్ధమన్నారు. ఆయనవెంట టీపీసీసీ నాయకులు నిమ్మ రంగారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కుంట్ల లక్ష్మారెడ్డి, సర్దార్‌ఖాన్, కడపల్ల కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, నక్కరాములుగౌడ్, కప్ప భాస్కర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి

చేర్యాలలో ఎట్టకేలకు డ్రైడే

- హాజరుకాని ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్



బ్లీచింగ్ చల్లిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి

చేర్యాల, జూలై 26: కొన్నాళ్లుగా చేర్యాల పట్టణంలో నిలిపివేసిన ఫ్రై డే డ్రైడే కార్యక్రమాన్ని మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఎట్టకేలకు చేపట్టారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో చేర్యాల మునిసిపల్‌లో 'అటకెక్కిన డ్రై డే' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మునిసిపల్ అధికారులు, పాలక మండలి, వైద్యసిబ్బందితో కలిసి శుక్రవారం ఆయా వార్డులలో పర్యటించారు. దోమలకు ఆవాసంగా గోలాలు, ఇతరత్రా వస్తువులలో వృథాగాఉన్న నీటిని తొలగింపచేశారు. అక్కడక్కడ బ్లీచింగ్ చల్లారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఇదిలా ఉండగా గతవారం గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ డ్రైడేలో పాల్గొన్న ఇన్‌చార్జి కమిషనర్ నర్సయ్య శుక్రవారం చేర్యాలలో పాల్గొంటానని తెలిపినా హాజరుకాకపోవడం గమనార్హం.

కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళులు



గజ్వేల్: కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గజ్వేల్/మర్కుక్, జూలై 26: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కో-ఎడ్యుకేషన్) లోని ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీర జవానులకు రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.గణపతిరావు హాజరయ్యారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ బాలరాజు, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్స్ ఎస్.రమేష్‌బాబు, విజయభాస్కర్‌రెడ్డి, వై. రామచంద్ర, పెద్దిరాజు, కవిత, విష్ణు, ఓంప్రకాష్, విద్యార్థులు, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్‌లో వీరజవాన్‌లకు వందనం చేస్తూ విద్యార్థులు ఉపాధ్యాయులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, ఉపాధ్యాయులు హారిక, చిన్నికృష్ణ తదితరులున్నారు.

'భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

సిద్దిపేట అర్బన్, జూలై 26 : రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, తంబ్ ఇంప్రెషన్ తొలగించి పాత పద్ధతిలో భవన నిర్మాణ కార్మికులకు కార్డులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ఉప కార్మికశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ, సలహా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్, జిల్లా అధ్యక్షుడు సంపత్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఈరి భూమయ్య, ఉడుగుల శ్రీనివాస్, సిరిగిరి ముత్తిలింగం, పొన్నాల రేణుక, సురేందర్, మల్లేశం, రాజయ్య సిద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ భూనిర్వాసితుల పక్షాన అసెంబ్లీలో సీఎం ప్రకటన చేసి ఆదుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి

గజ్వేల్, జూలై 26: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల పక్షాన బడ్జెట్‌లో నిధులు కేటాయించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడం ద్వారా నిర్వాసితులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి కోరారు. గజ్వేల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మించిన మల్లన్నసాగర్ ప్రాజెక్టు మూలంగా అనేక గ్రామాలు ముంపునకు గురైనవని, ప్రాజెక్టు భూసేకరణ ప్రారంభ సమయంలో గత ప్రభుత్వం చెప్పిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు, నష్టపరిహారాలు గ్రామ ప్రజల కోసం నిర్మించిన కాలనీలలో సౌకర్యాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోపు మల్లన్న సాగర్ భూబాధితులను ఆదుకోవడానికి ప్రకటన చేసి నిధులు కేటాయించి నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'ముదిరాజ్ కులస్థులను బీసీ-ఏలో చేర్చాలి'

నారాయణరావుపేట/మిరుదొడి, జూలై 26: ముదిరాజ్ కులస్థులను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు హేమ ధర్మ ముదిరాజ్ కోరారు. ముదిరాజ్ మహాసభ తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు తోట్ల పరుశురాములు, మిద్దే రవి, గాడిచర్ల నాగరాజు, మండల ముదిరాజ్ సంఘం నాయకులు కోనయ్యగారి ఎల్లయ్య, వెంకట్, ముత్యం, పరుశురాములు, సుధాకర్, నారాయణ, భాస్కర్, శంకర్, రామచంద్రం, భూమయ్య అశోక్ తదితరులు పాల్గొన్నారు.-

ముదిరాజ్‌ల అభ్యున్నతికోసం రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని మిరుదొడ్డి సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు డిమాండ్ చేశారు. మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ముదిరాజ్‌ల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేయాలంటూ డిప్యూటీ తహసీల్దార్ వీరేష్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు విద్యాసాగర్, స్వామి, రవి, చంద్రం, నర్సింహులు, కనకరాజు తదితరులున్నారు.

108 అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్‌కు అవార్డు

కొండపాక, జూలై 26: కొండపాక 108 అంబులెన్స్ టెక్నీషియన్ మహేందర్‌కు ఉత్తమ సేవలందించినందుకు గాను స్టార్ ఈఎంటీ అవార్డును అందుకున్నాడు. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ అఫ్రోజ్, ఇన్స్‌స్ట్రక్టర్ ప్రమోద్ అవార్డు అందచేశారు

బెజ్జంకి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్

బెజ్జంకి, జులై 26: బెజ్జంకి ఎంపీడీవోగా కె. ప్రవీణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బెజ్జంకి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన లక్ష్మప్ప బదిలీపై వెళ్లగా నిజామాబాద్ జిల్లా మోస్రా మండలంలో విధులు నిర్వహించిన కె.ప్రవీణ్ బదిలీపై బెజ్జంకివచ్చారు.

అర్చకుడికి అవార్డు

మద్దూరు, జూలై 26: మండలకేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి అర్చకులు పానుగంటి తిరుపతయ్య హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రీప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిగ్గెస్ట్ అవార్డ్స్ సెలబ్రేషన్స్‌లో జ్యోతిష అర్చక రత్నాకరం బిరుదు, ఐరావతం అవార్డు అందుకున్నాడు.

పిల్లల సామర్థ్యాలు గుర్తించాలి

- ఎంఎన్‌వో వెంకటరాములు



విద్యార్థితో మాట్లాడుతున్న వెంకటరాములు

మర్కుక్, జూలై 26: గత వారం నిర్వహించిన బేస్లైన్ టెస్ట్‌లో విద్యార్థి కనీస సామర్థ్యాలను గుర్తించాలని మండల నోడల్ అధికారి వెంకటరాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎంపీయూపీఎస్ కర్కపట్ల, ఎంపీపీఎస్ కాశిరెడ్డిపల్లి, ఎంపీపీఎస్ భవానందాపూర్ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశంతో, విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. వారితో సీఆర్పీ నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'విద్యార్థులు కష్టపడి చదవాలి'

మద్దూరు, జూలై 26: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం కష్టపడి చదవాలని సొసైటీ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి సూచించారు. మండలంలోని లద్నూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు టై బెల్టులు, బ్యాడ్జ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జీడికంటి సుదర్శన్, రామడుగు బాల్‌రాజ్, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి

- బీజేవైఎం మండల అధ్యక్షుడు రమేష్ యాదవ్

బెజ్జంకి, జూలై 26: జిల్లాల పునర్విభజనలో భాగంగా స్థానికత కోల్పోయిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మండలాల్లోని నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు తూముల రమేష్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బెజ్జంకి, కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలు సిద్దిపేట జిల్లాలో కలవడంతో నిరుద్యోగులు స్థానికత కోల్పోయారని అన్నారు.

డీవైఈఐఈగా బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట అగ్రికల్చర్: సమాచార పౌర సంబంధాలశాఖ సిద్దిపేట జిల్లా ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజనీరు(డీవైఈఐఈ)గా నూతనంగా నియామితమైన భూపాల్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరిని కలిసి పూల బోకే అందించి, అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

- నిధులు కేటాయించలేదని కాంగ్రెస్ ఆరోపణ



మద్దూరు: ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, జూలై 26: కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా వివక్ష వహించడం తగదని పేర్కొంటూ శుక్రవారం చేర్యాల పాతబస్టాండు వద్ద కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, చెవిటి లింగం, మార్కెట్ డైరెక్టర్లు తడక లింగమూర్తి, పాల లక్ష్మీనారాయణ, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్లు ముస్త్యాల కిష్టయ్య, ఆడెపు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా వివక్ష వహించడం తగదని యూత్ కాంగ్రెస్ కొమురవెల్లి మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. కొమురవెల్లి మండలకేంద్రంలో శుక్రవారం ప్లకార్డులతో ప్రధాన చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు.

- **మద్దూరు:** మద్దూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మేక మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.
- **దూళిమిట్ట:** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోల సాయిలుగౌడ్, బెక్కల్ దేవస్థానం చైర్మన్ చొప్పరి మల్లేశం, మండల మహిళ విభాగం అధ్యక్షురాలు చల్ల లత రెడ్డి, డైరెక్టర్ పాల్త్య శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు తుషాలపురం మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీని సద్వినియోగం చేసుకోవాలి'

తొగుట, జూలై 26: పంట రుణమాఫీని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాన్గల్ సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి కోరారు. తొగుట సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ నిధులను విడుదల చేసిందని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణమాఫీ అయిన రైతులందరూ సంబంధిత డాక్యుమెంట్లను తీసుకు వచ్చి తిరిగి రుణాలను పొందాలని సూచించారు. సొసైటీలో యూరియా, గ్రోమోర్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షా సప్తాహ్

చేర్యాల, జూలై 26 : చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నైపుణ్య, డిజిటల్ పథకాలు, పర్యవసానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, పద్మ, లక్ష్మణ్, అందె విజయ్‌కుమార్, నిరుపమ, మనోజ్‌కుమార్, ప్రకాశరెడ్డి, మాధవి, యాదగిరి తదితరులున్నారు.

'సోషల్‌మీడియాలో ఆరోపణలు చేయడం సరికాదు'



మాట్లాడుతున్న రంగారెడ్డి, భాస్కర్

గజ్వేల్, జూలై 26: నర్సారెడ్డిపై సోషల్‌మీడియాలో ఆరోపణలు చేయడం సరికాదని టీపీసీసీ కార్యదర్శి నిమ్మ రంగారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడిపై సోషల్ మీడియా వేదికగా పలువురు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. వారివెంట నాయకులు కుంట్ల లక్ష్మారెడ్డి, మోహన్నగారి రాజు, మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకుడు సమీర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, రాములుగౌడ్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా డ్రైడే నిర్వహించాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ కె. ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్, జూలై26: ప్రతి ఒక్కరూ విధిగా ప్రతీ శుక్రవారం తమ తమ ఇళ్లలో డ్రైడే నిర్వహించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ కే. ప్రసన్నరాణి సూచించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని 28వ వార్డులో కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్‌తో కలిసి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజు ఉదయాన్నే ఉడకబెట్టిన గుడ్డు, పాలు అందిస్తున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎడ్ల అరవింద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

- **మర్కుక్:** సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అంగన్వాడీ టీచర్లు రాణి, స్వప్నలు అన్నారు. శుక్రవారం గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.



మర్కుక్: వినియోగించని నీటిని పారబోయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వప్న

- **జగదేవ్‌పూర్:** వానాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జగదేవ్‌పూర్ వైద్యాధికారి సత్యప్రకాష్ సూచించారు. ధవలాపూర్‌లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట టౌన్: పట్టణంలోని 28వ వార్డు ముర్షద్‌గడ్డలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్

- **గజ్వేల్:** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని 1, 4 వార్డుల్లో మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్యతో కలిసి డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఆయనవెంట కౌన్సిలర్లు బొగ్గుల చందు, పంబాల అర్చన శివకుమార్, మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ తదితరులు ఉన్నారు.